సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం । 21 । ఆగస్టు । 2024



అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఆందోళన

సికింద్రనగర్‌లో అధికారులు అక్రమార్కులకు భూమి రిజిస్ట్రేషన్ చేశారని గ్రామస్తులు ధర్నా చేపట్టారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.70 అడుగులు
ఇన్‌ఫ్లో	: 47180 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 47180 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29029 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8067 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 7684 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	642.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1644.32 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 486.28 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 261.36 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 166.32 క్యూసెక్కులు
సీపేజీ, లీకేజీ ద్వారా	: 11.15 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

ప్రవేశాలకు గడువు పొడిగింపు

భువనగిరి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల భువనగిరి లెర్నింగ్ సపోర్టు సెంటర్ కో ఆర్డినేటర్ గంజి రమేష్ మంగళవారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీలో ప్రవేశాలకు ఇంటర్ విద్యార్థులు అర్హులని తెలిపారు. పదో తరగతి తర్వాత రెండేళ్ల ఒకేషనల్ కోర్సు చేసిన వారు కూడా అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 90005 90545ను సంప్రదించాలని కోరారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో ఆకుపూజ జరిపించారు. హనుమంతుడికి నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక.. ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవ పూజలు నిర్వహించారు.

సివిల్ సప్లయ్ మేనేజర్‌గా జగదీశ్‌కుమార్

భువనగిరిటౌన్: సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్‌గా జగదీశ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న గోపికృష్ణ రంగారెడ్డి జిల్లా మేనేజర్‌గా బదిలీకాగా నిజామాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న జగదీశ్‌కుమార్ యాదాద్రిభువనగిరి జిల్లాకు వచ్చారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

భువనగిరి రూరల్: గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జ్ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ యశోద అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం భువనగిరి మండలంలోని బొల్లెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, పల్లె దవాఖాన వైద్యులు, సూపర్‌వైజర్లు, ఆశాకార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు.అనంతరం పీహెచ్‌సీలో పనిచేసి బదిలీపై వెళ్లిన వైద్య సిబ్బంది శోభారాణి, అరుణ బాయి, శ్రీవాణి, వంశీలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రామకృష్ణారావు, జిల్లా అడిషనల్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మనోహర్ రావు, డాక్టర్ యామిని, పల్లె దవాఖాన డాక్టర్లు మురళి, తులసి, ప్రీతి, కాంచన, నిఖిల్, విజయ, దివ్య, పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తించాలి

భువనగిరిటౌన్: మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ కాంతి వెస్లీ, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ కర్ణన్ మంగళవారం జిల్లా సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సంక్షేమ అధికారిణి కేవీ కృష్ణవేణి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ యశోద, సీడీపీఓలు, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో ఈ నెల 22, 23వ తేదీల్లో జరగనున్న పీవైఎల్ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య కోరారు. మంగళవారం ఆత్మకూర్ (ఎస్)మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువతరం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, చైతన్యం కావడం కోసం ఈ రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట లెనిన్, మహేష్, రమేష్, లింగయ్య, రవి, కృష్ణ తదితరులు ఉన్నారు.



జూలూరులో కనుచూపు మేరలో పరుచుకున్న పచ్చదనం

• కనుచూపుమేర పచ్చదనం

మూసీ పరీవాహక ప్రాంతమైన భూదాన్‌పోచంపల్లి మండలం పచ్చదనంతో పరవళించిపోతోంది. ఈ సీజన్‌లో రైతులు మండల వ్యాప్తంగా 27వేల ఎకరాలకు పైగా వరిసాగు చేశారు. ఏ గ్రామానికి వెళ్లినా కనుచూపు మేరలో వరిచేలు పరుచుకొని పచ్చదనంతో కోనసీమను తలపిస్తున్నాయి.

– భూదాన్‌పోచంపల్లి

పంటలకు ఊపిరి

- వరి, పత్తి పంటలను బతికించిన వరుణుడు
- ఈ సీజన్‌లో ఇదే భారీ వర్షం
- యాదగిరిగుట్టలో అత్యధిక వర్షపాతం నమోదు



ఆలేరు మండలంలో పత్తి చేలు

సాక్షి,యాదాద్రి: వరుణుడి రాక కోసం ఎదురుచూస్తున్న రైతులకు సోమవారం కురిసిన వర్షం పంటలకు ఊపిరిపోసినట్లయింది. కొన్ని మండలాల్లో భారీగా, మరికొన్ని మండలాల్లో మోస్తరు వర్షం పడింది. వర్షాకాలం ప్రారంభం నుంచి జిల్లాలో కురిసిన అతిపెద్ద వర్షం ఇదే. వర్షాలు లేక రైతులు వేసిన పంటల దిగుబడిపై తీవ్రమైన ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది. సరైన వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వరి సాగు గణనీయంగా తగ్గింది. వరినాట్లను కాపాడుకోవడానికి రైతులు ట్యాంకర్లను ఆశ్రయించారు. ఈ సమయంలో కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2.90 లక్షల ఎకరాల్లో వరి, పత్తి సాగు

జిల్లాలో రైతులు ఈ సారి 2.90లక్షల ఎకరాల్లో వరి, పత్తి సాగు చేశారు. కందులు, ఇతర పంటల సాగు కూడా చేసినప్పటికీ ప్రధానంగా రైతులు పత్తి, వరికే ప్రాధాన్యత ఇచ్చారు. అయితే సరైన వర్షాలు లేక వరి సాగు గణనీయంగా తగ్గింది. 2.50 లక్షల ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. సరైన వర్షాలు లేక రైతుల పొలాల్లోనే నారు ముదిరిపోయింది. 1.90లక్షల ఎకరాల్లో చేసిన వరిసాగుకు సరిపోను నీరందడం లేదు. ప్రధానంగా భూగర్భ జలాలపై ఆధారపడి సాగు చేసిన వరి ఎండిపోయే దశకు చేరుకుంటున్న సమయంలో కురిసిన భారీ వర్షం జీవం పోసింది. జిల్లాలో సాగైన లక్ష ఎకరాల పత్తికి ప్రాణం పోసింది. మరో 20 రోజుల వరకు ఈ వర్షం పంటలకు లాభం చేకూరుస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

పంటల సాగు వివరాలు

పంట	సాగు విస్తీర్ణం ఎకరాల్లో
వరి	1,90,900
పత్తి	1,00,514
కందులు	2,694
ఇతర పంటలు	6,963

వర్షంతో చేలకు ప్రాణం వచ్చింది



కురిసిన వర్షంతో ప్రాణం లేచి వచ్చింది. నేను 40ఎకరాలు భూమి కౌలుకు తీసుకుని రూ.15 లక్షల పెట్టుబడితో పత్తి సాగు చేశాను. వాన పడకపోతే గూడ రాలిపోయేది. పంటకు అడుగు ఎరువులు వేశాను. వర్షం పడింది కాబట్టి పైమందులు కొట్టాలి. మరో 20 రోజుల వరకు వర్షం పడకపోయినా నష్టం లేదు. మరో వాన కురిస్తే ఇంకా మంచిది. వర్షాలు సరిపోను కురిస్తే ఎకరానికి ఆరు నుంచి ఏడు క్వింటాళ్ల దిగుబడి రావచ్చు.

– అనిమిరెడ్డి తిరుమల్‌రెడ్డి, ఆలేరు

తొలిసారిగా భారీ వర్షం

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లాలో తొలిసారిగా భారీ వర్షం నమోదైంది. సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసింది. యాదగిరిగుట్టలో అత్యధికంగా 170.3 మీ.మీ వర్షపాతం నమోదుకాగా రామన్నపేటలో 6.3 మీ.మీ నమోదైంది. ఈ వర్షంతో జిల్లాలోని రైతులు ఉపశమనం పొందారు. అదేవిధంగా హైదరాబాద్‌లో కురిసిన వర్షాలకు జిల్లాలో మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. బీబీనగర్, పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట మూసీ పరీవాహక ప్రాంతాల్లో లో లెవల్ బ్రిడ్జిలపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు.

వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లు)	మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
యాదగిరిగుట్ట	170.3	ఆలేరు	68.5	ఆత్మకూర్(ఎం)	32.5
భువనగిరి	132.3	నారాయణపురం	68.3	పోచంపల్లి	29.3
బొమ్మలరామారం	98.8	తుర్కపల్లి	56.5	బీబీనగర్	19.8
మోటకొండూరు	95.5	రాజాపేట	45.3	గుండాల	15.3
		చౌటుప్పల్	33.8	అడ్డగూడురు	8.3
				రామన్నపేట	6.3

అలంకార ప్రాయంగా విద్యుత్ టవర్లు

- రూ.8.60కోట్లతో 150 ఎత్తైన టవర్ల ఏర్పాటు
- ఇప్పటికే రూ. 3.90 కోట్లు మంజూరు
- ఏడాది కాలంగా నిలిచిపోయిన పనులు
- వర్క్ ఆర్డర్ కోసం అంచనాలు సరిచేసి పంపిన అధికారులు



భువనగిరి పట్టణంలో ఎల్‌టీ లైన్లు ఏర్పాటు చేయని విద్యుత్ టవర్లు

భువనగిరిటౌన్: జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన విద్యుత్ టవర్ల పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో రూ. 8.60కోట్లతో పాత బస్టాండ్ నుంచి హైదరాబాద్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా పదమూడున్నర మీటర్ల ఎత్తైన టవర్ల ఏర్పాటు పనులు చేపట్టారు. హైదరాబాద్ చౌరస్తా నుంచి చెరువువద్ద గల విద్యుత్ సబ్ స్టేషన్ వరకు మొత్తం 150 టవర్లు, 33 కేవీ ఎల్‌టీ లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. సంవత్సరం కాలంగా ఈ పనులు నిలిచిపోయాయి.

రివైజ్డ్ ఎస్టిమేషన్‌కు పంపిన అధికారులు

విద్యుత్ టవర్లకు విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా విద్యుత్‌శాఖకు భువనగిరి మున్సిపాలిటీ రూ.86 లక్షల నిధులు చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్ టవర్ల అనుమతికి దరఖాస్తు చేసుకున్న అప్పటి కాంట్రాక్టర్ టవర్ల పనులు పూర్తి చేశారు. కానీ విద్యుత్‌శాఖకు కట్టాల్సిన రూ.86 లక్షలు చెల్లించకపోవడంతో వర్క్ ఆర్డర్ ఇవ్వలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఇటీవల రూ.3.90 కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్ వర్క్ ఆర్డర్ కోరగా విద్యుత్ శాఖ కమిషనర్ నుంచి భువనగిరి విద్యుత్ శాఖ అధికారులు రివైజ్డ్ ఎస్టిమేషన్‌కు పంపించారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభించనున్నారు.

అనుమతి రాగానే వర్క్ ఆర్డర్ ఇస్తాం

మున్సిపాలిటీ విద్యుత్ శాఖకు కొన్ని నిధులు కట్టినట్లు అయితే వర్క్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంది. కానీ దరఖాస్తు చేసుకున్నా నిధులు కట్టకపోవడంతో పనులు ఆగిపోయాయి. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పనులు చేసేందుకు అనుమతి ఇస్తాం. కేవలం విద్యుత్ శాఖ నుంచి పర్యవేక్షణ మాత్రమే ఉంటుంది. అన్ని పనులు కాంట్రాక్టరే చూసుకుంటారు.

– ఆనంద్‌రెడ్డి, విద్యుత్ ఏడీ

రాష్ట్రీయ బాల పురస్కార్‌కు దరఖాస్తు చేసుకోవాలి

భువనగిరిటౌన్: వివిధ రంగాల్లో ప్రతిభచాటిన బాల బాలికలకు 2025 వ సంవత్సరంలో అందించనున్న ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌కు ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిణి కేవీ కృష్ణవేణి మంగళవారం తెలిపారు. ఈ అవార్డులకు 5 నుంచి 18 ఏళ్లలోపు వారు అర్హులని, ఇన్నోవేషన్, సోషల్ సర్వీస్, ధైర్య సాహసాలు, పాండిత్యం, క్రీడలు, కళలు, సాంస్కృతిక కళలు వంటి రంగాల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో National Awards Portal (https://awards.gov.in/) దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చే సుకున్న అనంతరం సంబంధిత ప్రతిని జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ, కలెక్టరేట్‌లో సమర్పించాలని పేర్కొన్నారు.

ఎయిమ్స్‌లో విధులు బహిష్కరించి నిరసన



ఎయిమ్స్‌లో ఓపీ సేవల విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్స్

బీబీనగర్: కోల్‌కత్తాలోని మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన లైంగికదాడి, హత్యా ఘటనకు నిరసనగా మంగళవారం బీబీనగర్ ఎయిమ్స్‌లో రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓపీ సేవల్లో పాల్గొనకుండా విధులు బహిష్కరించారు. అనంతరం ఆస్పత్రిలోని రోగులకు, సెక్యూరిటీ, సహాయక సిబ్బం దికి వైద్యులు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌మనోహర్, ఉపాధ్యక్షులు రెమ్యామేరీజాన్, మోహిత్ కపూర్, ప్రధాన కార్యదర్శి భాను ప్రకాష్, జాయింట్ సెక్రటరీ అర్జున్ బెనర్జీ, సంయుక్త కార్యదర్శి భరత్‌కుమార్ పాల్గొన్నారు.

అమిత్‌కు డెయిరీ కార్పొరేషన్

- డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్మన్‌గా నియామకం
- రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్న గుత్తా అమిత్‌రెడ్డి
- గతంలో మదర్ డెయిరీ ఛైర్మన్‌గా పనిచేసిన తండ్రి, బాబాయ్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. అమిత్‌రెడ్డి శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు. చిట్యాల మండలం ఉరుమడ్లకు చెందిన అమిత్‌రెడ్డి.. గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు స్థాపించి నాలుగేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ సందర్భంగా ఫిజికల్ టెస్టులకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు మెటీరియల్‌తో పాటు తన సొంత ఖర్చులతో కోచింగ్ ఇప్పించారు. తన తండ్రి బీఆర్‌ఎస్ నుంచి శాసన మండలి ఛైర్మన్‌గా ఉండగా, అసెంబ్లీ ఎన్నికల్లో అమిత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయాలని భావించారు. మునుగోడు టికెట్ ఆశించారు. కానీ అధిష్టానం ఆయనకు అవకాశం ఇవ్వలేదు. అదే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున దేవరకొండ నియోజక వర్గ ఎన్నికల ఇంచార్జిగా వ్యవహరించారు. ఆ తరువాత ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకున్నారు. నల్లగొండ, భువనగిరి స్థానాల్లో ఏది ఇచ్చినా పోటీచేసేందుకు సిద్ధమని అనుకున్నారు. కానీ పార్టీలో కొందరు ఆయనకు టికెట్ ఇవ్వొద్దని అధిష్టానానికి చెప్పడంతో.. పార్టీలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తనకు టికెట్ అవసరం లేదని అమిత్ అధిష్టానానికి చెప్పారు. ఆ తరువాత బీఆర్‌ఎస్‌కు కొంతకాలం దూరంగా ఉన్న అమిత్‌రెడ్డి తన బాబాయి, మదర్ డెయిరీ మాజీ ఛైర్మన్ జితేందర్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం అమిత్‌కు ఏదో ఒక కార్పొరేషన్ పదవి వస్తుందన్న చర్చ జరిగింది. అనుకున్నట్లుగానే అమిత్‌రెడ్డికి ఇప్పుడు కార్పొరేషన్ పదవి దక్కింది. ఈ పదవిలో ఈయన రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. గతంలో తన తండ్రి, బాబాయి ఇద్దరూ మదర్ డెయిరీ ఛైర్మన్‌గా పనిచేశారు. తాజాగా ఇప్పుడు అమిత్‌రెడ్డి రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ కావడం విశేషం.

ప్రజల్లో భయాందోళన కలిగించొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

- కలెక్టర్ హనుమంతు కె. జెండగే



ఏరియా ఆస్పత్రిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

భువనగిరి: డెంగీ కేసుల పట్ల ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రజల్లో అనవసరమైన భయాందోళనలు కలిగించొద్దని కలెక్టర్ హనుమంతు కె. జెండగే అన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు జ్వరంతో బాధపడుతూ ప్రభుత్వ ఆస్పత్రులకు వైద్యం కోసం వచ్చినప్పుడు పరీక్షల అనంతరం నిర్ధారణ కాకుండా ఎట్టి పరిస్థితుల్లో డెంగీగా ప్రకటించొద్దని సూచించారు. పాజిటివ్ కేసులు వచ్చిన చోట తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లేదా సంబంధిత ఏరియా ఆస్పత్రి వైద్యాధికారికి తెలియజేయాలన్నారు. జ్వరం ఉన్న కేసుల శాంపిళ్లను టీ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు పంపాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలన్నారు. అదనపు కలెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ సీజనల్ డిసీజ్ విషయంలో రాష్ట్రస్థాయి అధికారులు సందర్శించేందుకు వచ్చే అవకాశం ఉన్నందున వైద్యాధికారులు మందుల స్టాక్ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ యశోద మాట్లాడుతూ.. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి డెంగీ సర్వే చేయాలన్నారు. అడిషనల్ డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ మనోహర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 46 డెంగీ అనుమానిత కేసులు నమోదైనట్లు తెలిపారు. సమావేశంలో రాజారావు, చిన్నా నాయక్, సాయి శోభ, శిల్పిని, రామకృష్ణ పాల్గొన్నారు.

ఒకే రోజులో రక్త పరీక్షల వివరాలు అందించాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వచ్చే శాంపిల్స్‌ను పరీక్ష చేసి నివేదికలు అదే రోజు సమర్పించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా ఏరియా ఆస్పత్రిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ డిస్ట్రిక్ట్ హబ్ విభాగాన్ని సందర్శించి ల్యాబ్ లో జరుగుతున్న పరీక్షల వివరాలను పరిశీలించారు. ఆయన వెంట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావ్, డాక్టర్ చిన్ను నాయక్ ఉన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

భువనగిరిటౌన్: వచ్చే ఐదు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులకు సూచించారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్ షాలోమ్, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, జిల్లా పంచాయతీ అధికారి సునంద పాల్గొన్నారు.

రుణమాఫీకి నోడల్ అధికారులు

- రుణమాఫీ పొందని రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ
- మండలానికి నోడల్ అధికారి నియామకం
- తప్పులు సరిచేసి క్రాప్ లోన్ మాఫీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్న అధికారులు



సాక్షి,యాదాద్రి: ప్రభుత్వం మూడు విడతల్లో అమలు చేసిన రూ.రెండు లక్షల వరకు పంట రుణమాఫీ జిల్లాలో చాలా మంది రైతులు పొందలేదు. దీంతో వారి నుంచి ప్రభుత్వం ఫిర్యాదులను స్వీకరిస్తోంది. ఈమేరకు జిల్లా స్థాయిలో నోడల్ అధికారితోపాటు మండలానికో నోడల్ అధికారిని నియమించింది. మండల వ్యవసాయాధికారులు లేని చోట్ల ఏఈఓలకు ఈ బాధ్యతలను అప్పగించింది. అదేవిధంగా కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ 08685-293312ను ఏర్పాటు చేసింది.

రుణమాఫీ పొందిన రైతుల వివరాలు

మొదటి విడతలో	36,483 మంది	రూ. 199.87కోట్లు
రెండో విడతలో	17,991 మంది	రూ. 176.12కోట్లు
మూడో విడతలో	9,995 మంది	రూ.164.66కోట్లు

రైతు వేదికల వద్ద అందుబాటులో..

నోడల్ అధికారులు తమకు కేటాయించిన మండలంలోని రైతు వేదిక వద్ద అందుబాటులో ఉంటారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు. స్వీకరించిన ఫిర్యాదులను క్రాప్ లోన్ వెయ్‌వర్ పోర్టల్‌లో ఉన్న సమాచారంతో సరిచూస్తారు. దీని ద్వారా రుణమాఫీ ఎందుకు కాలేదో తెలిసిపోతుంది. సాంకేతిక సమస్యలు ఉన్నా తెలుసుకోవడానికి అవకాశం ఉంది. రైతులు ఏ సమయంలో ఎంత రుణం తీసుకున్నారు. ఏ బ్యాంకు బ్రాంచ్‌లో తీసుకున్నారనే వివరాలు ఉంటాయి. బ్యాంకు లోన్ అకౌంట్, ఆధార్ కార్డు వివరాలు తప్పుగా ఉంటే వాటిని సరిచేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. రేషన్ కార్డు లేకపోతే రైతు కుటుంబంలోని ఆధార్ కార్డులు తీసుకుంటారు. అసలు, వడ్డీ మొత్తంతో సరిపోకపోతే రైతు నుంచి దరఖాస్తును తీసుకుని నిర్ధారణ కోసం వివరాలను బ్యాంకుకు పంపించనున్నారు.

నోడల్ అధికారుల ఫోన్ నంబర్లు

భువనగిరి	86397 78145
బీబీనగర్	72888 94197
పోచంపల్లి	72888 94187
వలిగొండ	72888 94188
నారాయణపురం	72888 94514
చౌటుప్పల్	72888 94513
రామన్నపేట	90009 78601
యాదగిరిగుట్ట	72888 94194
రాజాపేట	72888 94196
బొమ్మలరామారం	72888 94197
మోటకొండూర్	72888 78409
తుర్కపల్లి	728889 4195
ఆలేరు	728889 4190
ఆత్మకూర్	72888 94191
మోత్కూర్	72888 94528
అడ్డగూడూరు	72888 78405
గుండాల	94929 26264

రుణమాఫీ కాని వారు సంప్రదించాలి

పంట రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారానికి ప్రతి మండలంలో మండల నోడల్ అధికారిని నియమించడం జరిగింది. రుణమాఫీ కానీ రైతులు వారి బ్యాంకు లోన్ అకౌంట్ పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలను అప్లికేషన్‌తో జత చేసి సంబంధిత మండల వ్యవసాయ అధికారికి ఇవ్వాలి. వివరాలకు జిల్లా నోడల్ అధికారి రాజేష్ సెల్ నంబర్, 7288878411. టోల్‌ఫ్రీ నంబర్ 08685-293312 ను సంప్రదించాలి.

– అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారిణి

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీ.. యువకుడు మృతి

బీబీనగర్: రెండు బైక్‌లు ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన బీబీనగర్ మండల కేంద్రంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు మార్గంలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం రహీమ్‌ఖాన్‌గూడెం గ్రామానికి చెందిన ధరావత్ సాయికిరణ్ (19) బీబీనగర్ నుంచి బ్రాహ్మణపల్లి వైపు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గ మధ్యలో భారత్ గ్యాస్ గోదాం వద్దకు రాగానే ఎదురుగా మరో బైక్‌పై వస్తున్న వ్యక్తి సాయికిరణ్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సాయికిరణ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య


ప్రవీణ్ (ఫైల్)

గుర్రంపోడు: ఇంట్లో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం ఆములూరు గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ బి. శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆములూరు గ్రామానికి చెందిన మేకల ప్రవీణ్(30) వ్యవసాయంతో పాటు చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి వివాహం కాలేదు. కాగా ప్రవీణ్ మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించే సమయానికి మృతిచెందాడు. తన కుమారుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియవని మృతుడి తండ్రి మేకల అంజయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి


మృతిచెందిన ఆవులు

నూతనకల్: మండల పరిధిలోని మాచనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గుగులోతు తండాలో సోమవారం రాత్రి పిడుగుపాటుకు రెండు ఆవులు మృతిచెందాయి. గుగులోతు తండాకు చెందిన రైతు గుగులోతు రాములు సోమవారం సాయంత్రం తన రెండు ఆవులను వ్యవసాయ బావి దగ్గర కట్టేసి ఇంటికి వచ్చాడు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగుపడి రెండు ఆవులు మృతిచెందాయి. మంగళవారం ఉదయం వ్యవసాయబావి వద్దకు వెళ్లిన రాములుకు ఆవులు మృతిచెంది కనిపించాయి. తాను వ్యవసాయానికి ఉపయోగించే ఆవులు మృతిచెందడంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. మృతిచెందిన ఆవుల విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు.

లారీ ఫైనాన్స్ ఎగ్గొట్టేందుకు స్కెచ్

- లారీ చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేసిన యజమాని
- అతడే బత్తాయి తోటలో లారీని దాచినట్లు గుర్తించిన పోలీసులు
- కేసు నమోదు.. రిమాండ్‌కు తరలింపు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరబాబు

మిర్యాలగూడ అర్బన్: లారీ ఫైనాన్స్ ఎగ్గొట్టేందుకుగాను లారీ చోరీకి గురైందని యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా లారీ యజమానే తన బంధువుల బత్తాయి తోటలో లారీని దాచినట్లు పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మాడుగులపల్లి మండలం ధర్మపురం గ్రామానికి చెందిన బండారపు నాగార్జున ఐదేళ్ల క్రితం ఓ ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.13లక్షలు ఫైనాన్స్ తీసుకుని లారీ కొనుగోలు చేశాడు. ప్రతి నెల రూ.54వేలు కిస్తీ కట్టాల్సి ఉన్నా.. దొంగలు లారీని ఎత్తుకెళ్లారని నమ్మించి పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయిస్తే లారీపై ఉన్న ఫైనాన్స్ ఎగ్గొట్టొచ్చని ప్లాన్ వేశాడు. ఈ మేరకు మే 22న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం నుంచి రూ.12లక్షల విలువైన ఐరన్ స్క్రాప్ లోడ్‌తో మహారాష్ట్రకు బయల్దేరిన లారీని మిర్యాలగూడలో తాను నివాసముంటున్న దుర్గానగర్‌కు తీసుకొచ్చాడు. రెండు రోజుల తర్వాత లారీని కనగల్ మండలం చిన్నమాదారం గ్రామానికి చెందిన తన అల్లుడు బొడ్డుపల్లి అనిల్‌కు చెందిన బత్తాయి తోటలో దాచిపెట్టాడు. మే 28న తన లారీ చోరీకి గురైందని మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నాగార్జునే కనగల్ మండలం చిన్నమాదారం గ్రామంలోని బత్తాయి తోటలో లారీని దాచిపెట్టినట్లు తెలుసుకున్నారు. దీంతో మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, ఎస్‌ఐ నరేష్ వెళ్లి తోటలో లారీని గుర్తించారు. ఫైనాన్స్ సంస్థను, పోలీసులను పక్కదారి పట్టించేలా వ్యవహరించిన బండారపు నాగార్జునపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. లారీతో పాటు రూ.12లక్షల విలువైన ఐరన్ స్క్రాప్, లారీ పత్రాలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ గఫార్, రాములునాయక్‌ను డీఎస్పీ రాజశేఖరరాజు అభినందించారు.

ట్రామా కేర్ సెంటర్‌కు స్థలాన్ని గుర్తించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

కట్టంగూర్ : ట్రామా కేర్‌సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని తహసీల్దార్ గుగులోతు ప్రసాద్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం కట్టంగూర్ మండలంలోని పామనగుండ్ల గ్రామంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి మట్లాడారు. హైదరాబాద్- విజయవాడ 65వ జాతీయ రహదారిపై ట్రామా కేర్ సెంటర్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గుర్తించిన స్థలంలో మూడు రోజుల్లోగా ప్రభుత్వ, ఖాళీ స్థలాన్ని స్పష్టంగా విభజించి హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ స్థలంలో చెత్తాచెదారం, చెట్లను తొలగించి చదును చేయించాలని సూచించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఫీవర్ సర్వే వివరాలను, శానిటేషన్, ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలపై కార్యదర్శి జయసుధను అడిగి తెలుసుకున్నారు.

'ధరణి' సమస్యలు పరిష్కరించాలి

- నల్లగొండ ఆర్డీఓ రవి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రవి

నల్లగొండ: ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించాలని నల్లగొండ ఆర్డీవో రవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో నల్లగొండ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో ధరణి సమస్యలపై సమావేశం నిర్వహించారు. సమస్యలు ఏ స్థాయిలో ఉన్నా చర్చించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డివిజన్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నూతనకల్: లారీ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన నూతనకల్ మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం ఎస్‌ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి బొగ్గు లోడుతో బయల్దేరిన లారీ మేళ్లచెరువులోని సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్తుండగా నూతనకల్ మండల కేంద్రంలోని భారత్ పెట్రోలియం బంక్ మూలమలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుకు పక్కన ఉన్న వేపచెట్లను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ నుజ్జునుజ్జయ్యింది. లారీ డ్రైవర్ బొమ్మెడ మోహన్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యాన్‌ను ఢీకొన్న కారు


ఘటనా స్థలంలో కారు, వ్యాన్

మునగాల : మండలంలోని 65వ నంబర్ జాతీయ రహదారిపై బరాఖత్‌గూడెం శివారులో గల ఈవీ చార్జింగ్ కేంద్రం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఓ కారు అతివేగంతో వచ్చి రోడ్డు పక్కనే ఉన్న టిఫిన్ సెంటర్ మొబైల్ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ సమయంలో మొబైల్ వ్యాన్ వద్ద ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలైనట్లు సమాచారం.

కాల్వలో గల్లంతైన బాలిక మృతదేహం లభ్యం


తేజశ్రీ మృతదేహం

వేములపల్లి: ప్రమాదవశాత్తు కాలు జారి సాగర్ ఎడమ కాల్వలో గల్లంతైన బాలిక మృతదేహం వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో మంగళవారం లభ్యమైంది. స్థానిక ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం కుసుమవారిగూడెం గ్రామానికి చెందిన పోతురాజు విజయలక్ష్మి, సైదులు దంపతులకు కుమార్తె తేజశ్రీ (14), కుమారుడు గోపిచంద్ సంతానం. విజయలక్ష్మి తమ్ముడు కోదాడి పరుశురాములు వివాహానికి ఆరు రోజుల క్రితం కుటుంబ సభ్యులంతా కలిసి వేములపల్లి మండలం బుగ్గబావిగూడేనికి వచ్చారు. ఆదివారం వివాహం అయిపోగా సోమవారం మధ్యాహ్నం వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమ కాల్వపై ఉన్న ఎల్-14 వద్ద బట్టలు ఉతికేందుకు విజయలక్ష్మి, తేజశ్రీ, గోపిచంద్‌తో పాటు మరికొందరు బంధువులు కలిసి వచ్చారు. ఈ క్రమంలో తేజశ్రీ కాలు జారి ఎడమ కాల్వలో పడిపోయి నీటి ప్రవాహానికి కొట్టుకుని పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు కాల్వ వెంట గాలింపు చర్యలు చేపట్టారు. కాగా మంగళవారం మధ్యాహ్నం శెట్టిపాలెం గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద కాల్వలో తేజశ్రీ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పార్కింగ్ చేసిన కారు దగ్ధం


ఘటనా స్థలంలో దగ్ధమైన కారు

చౌటుప్పల్: పార్కింగ్ చేసిన కారు దగ్ధమైంది. చౌటుప్పల్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణంలోని మార్కండేయనగర్ కాలనీకి చెందిన కలకుంట్ల శివకుమార్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. వలిగొండ రోడ్డులోని జయభూమి వెంచర్‌లో ఓ వ్యక్తికి చెందిన స్థలంలో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నారు. సోమవారం శివకుమార్ తన ఆల్టో కారును అదే ప్రాంతంలో పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం తెల్లవారుజామున మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన స్థానికులు కారు దగ్ధమైన ఉండటం గుర్తించి వెంటనే శివకుమార్‌కు సమాచారం అందించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ఎవరైనా కావాలనే కారును దగ్ధం చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దొంగ రిమాండ్

సూర్యాపేటటౌన్: మహిళ మెడలో బంగారు పుస్తెల తాడు చోరీ చేసేందుకు యత్నించిన దొంగను సూర్యాపేట పట్టణ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణానికి చెందిన తల్లాడ చంద్రకళ ఈ నెల 17వ తేదీన తన ఇంటి నుంచి నడుచుకుంటూ డీమార్ట్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా.. ద్వారకామయి అపార్ట్‌మెంట్ సమీపంలో ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాల్వాంచ ప్రవీణ్‌కుమార్ ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కొని పారిపోతుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి మంగళవారం నిందితుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పరీక్ష రాసే గదిలో వర్షపు నీరు

- అవస్థలు పడిన ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులు


పరీక్ష రాసే గదిలో నిలిచిన వర్షపు నీరు

రామగిరి(నల్లగొండ): వర్షపు నీటితో ఉన్న గదిలో పరీక్ష రాసేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. వర్షపు నీటితో ఉన్న గదిలో పరీక్షను నిర్వహించారు. గది మొత్తం నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదల్లుతుండడంతో పరీక్షా రాసేందుకు విద్యార్థులు అవస్థలు పడ్డారు. పరీక్ష రాసే సమయంలో కొంతమంది విద్యార్థుల జవాబు పత్రాలు నీటిలో పడడంతో ఆందోళనకు గురయ్యారు. పరీక్షకు ముందు యూనివర్సిటీ కోఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించలేదంటూ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. గదిలో పరీక్ష రాయలేక కొంతమంది విద్యార్థులు ముందుగానే వెళ్లిపోయినట్లు తెలిసింది.

దాడికి పాల్పడిన వ్యక్తులు పోలీసుల అదుపులో


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

సూర్యాపేటటౌన్: మద్యం మత్తులో వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేసిన నలుగురు వ్యక్తులపై అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. ఈ నెల 18వ తేదీన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రాజీవ్ పార్క్ వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి వెంట ఉన్న సెవెన్ లిక్కర్ మార్ట్ వద్ద మచ్చ సాయిశరత్ పార్కింగ్ చేసిన తన బైక్‌ను తీస్తున్నాడు. అతే సమయంలో సూర్యాపేట పట్టణానికి చెందిన కొండా ఉదయ్ అలియాస్ సైదు, చిట్టమోని ఈశ్వర్, పరశనబోయిన సైదులు, సాయికుమార్ మద్యం మత్తులో సాయిశరత్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దాడి చేసిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి మృతికి కారణమైన నిందితుల అరెస్ట్

నేరేడుచర్ల: పాత కక్షలు మనసులో పెట్టుకుని వ్యక్తిపై దాడిచేసి అతడి మృతికి కారణమైన ముగ్గురిని మంగళవారం నేరేడుచర్ల పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెం గ్రామానికి చెందిన మహ్మద్‌షేక్ జానీ(47)పై పాత కక్షలను మనసులో పెట్టుకుని అదే గ్రామానికి చెందిన మహ్మద్‌షేక్ మీరా, మహ్మద్‌షేక్ జాన్, మహ్మద్‌షేక్ ఆశాబీ ఈ నెల 15వ తేదీన కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన జానీని అతడి భార్య నన్నీబీ గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లి చూపించింది. ఆరోజు రాత్రి ఇంటి వద్దనే ఉన్న జానీని 16వ తేదీ సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 17వ తేదీన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ 18వ తేదీ సాయంత్రం మృతిచెందాడు. అదే రోజు మృతుడి భార్య నన్నీబీ నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు హుజూర్‌నగర్ సీఐ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. మంగళవారం నిందితులను పట్టుకుని కోర్టులో హాజరుపర్చినట్లు నేరేడుచర్ల ఎస్‌ఐ వెల్లడించారు.

గోదావరి నీళ్లు రావా..!

- ఎస్సారెస్పీ నీటి విడుదలపై స్పష్టత కరువు
- తప్పేలా లేని క్రాప్ హాలిడే!
- ఆరేళ్లలో తొలిసారి పంటలకు అందని నీళ్లు
- ఆందోళనలో 2.20 లక్షల ఎకరాల ఆయకట్టు రైతులు


ఎస్సారెస్పీ కాల్వ

భానుపురి (సూర్యాపేట) : గోదావరి జలాలపై రైతాంగం ఆశలు ఆవిరి కానున్నాయా... 2024 వానాకాలం సీజన్‌లో జిల్లాలోని ఆయకట్టుకు నీటి విడుదల కష్టతరం కానుందా.. ఈ వానాకాలంలో క్రాప్ హాలిడే తప్పదా.. అంటే దాదాపు అవుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాజెక్టుల్లో సమృద్ధిగా నీళ్లున్నా.. ఎగువ గోదావరిలోని ఎస్సారెస్పీ నుంచి లోయర్ మానేరు వరకు నీళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభమై 80 రోజులు కావొస్తున్నా సాగుకు నీటి విడుదలపై ఇంతవరకు ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. కనీసం నీటిని విడుదల చేసేది, లేనిది చెప్పకపోవడంపై జిల్లాలోని రైతులు కొంత ఆగ్రహంగా ఉన్నారు. ఆరేళ్ల కాలంలో తొలిసారిగా వానాకాలం సాగుకు నీళ్లు అందకపోవడం.. ఈ విషయమై ఇక్కడి ప్రజాప్రతినిధులు, నాయకులు నోరెత్తకపోవడంపై రైతులు గుర్రుగా ఉన్నారు.

నారు పోసి సిద్ధంగా ఉన్న రైతులు..

2018లో జిల్లాలోని చెరువులను నింపేందుకు అప్పటి ప్రభుత్వం ఎస్సారెస్పీ ద్వారా గోదావరి జలాలను వదిలింది. నాటినుంచి ఏటా రెండు పంటలకు ఎస్సారెస్పీ రెండోదశ కింద పంటల సాగుకు నీటిని విడుదల చేస్తున్నారు. కాళేశ్వరం పథకం కింద ఎత్తిపోతల ద్వారా నీటిని ఎల్లంపల్లి, మిడ్‌మానేర్, లోయర్ మానేరు మీదుగా జిల్లాలోని ఆయకట్టుకు అందిస్తూ వస్తున్నారు. ఆరేళ్లపాటు రెండు పంటలకు నీళ్లు అందగా.. తొలిసారిగా వానాకాలం కూడా ఆయకట్టుకు నీటిని అందించే పరిస్థితి లేకుండా పోయింది. గోదావరి జలాలు వస్తాయనే ఆశతో రైతులు వరి సాగుకోసం నార్లు పోసుకుని సిద్ధంగా ఉన్నారు. మరికొందరు డ్రమ్ సీడర్, వెదజల్లుడు ద్వారా వరి సాగు చేయాలని భావించారు. జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల పరిధిలో దాదాపు 2.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఎస్సారెస్పీ రెండోదశ కింద ఉంది.

నారు ముదిరిపోతోంది

ఎస్సారెస్పీ నీటి ఆధారంగానే మూడు, నాలుగేళ్లుగా వరి సాగు చేస్తున్నా. ఈ వానాకాలం నీళ్లు వస్తాయని నారుపోసి సిద్ధంగా ఉన్నా. ఇంతవరకు నీళ్లు రావడం లేదు. వరి సాగు చేయొచ్చని ఇతర పంటలను సాగు చేయలేదు. నారు ముదిరిపోతోంది. నీళ్లు వస్తాయో, రావో తెలియడం లేదు. ఎకరన్న భూమి ఖాళీగా ఉంది.

\- మధుసూదన్, ఆత్మకూర్ (ఎస్)

రెండెకరాలు అచ్చుకట్టాం

మాకున్న రెండెకరాల వ్యవసాయ భూమిలో గతేడాది వరకు పత్తి సాగు చేసేవాళ్లం. ఏటా ఎస్సారెస్పీ నీళ్లు వచ్చి జాలు పడుతుందని ఈ యేడు వరి సాగుకు అనుకూలంగా అచ్చుకట్టాం. తీరా చూస్తే ఇప్పటివరకు నీళ్లు రాలేదు. అటు పత్తి సాగు చేసుకోలేక.. ఇటు వరి సాగు చేసే అవకాశం లేక భూమి పడావు పడింది.

\- ఏ. రమేష్, రైతు

పైనుంచి వరద లేకపోవడంతో..

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు సగం మాత్రమే నిండడంతో అక్కడి నుంచి నేరుగా వానాకాలం పంటలకు సరిపడా నీళ్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. అలాగే ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి మిడ్ మానేరు.. అక్కడి నుంచి లోయర్ మానేరు మీదుగా సూర్యాపేట జిల్లాకు నీటిని అందించాల్సి ఉంది. అయితే ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు 15 రోజులపాటు నీటిని ఎత్తిపోయగా... పైనుంచి వరదలు తగ్గి నీటి ఎత్తిపోతల నిలిచిపోయింది. దీంతో మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటి తరలింపు లేక జిల్లాకు సాగునీటిని అందించే అవకాశం లేకుండా పోయినట్లు తెలుస్తోంది. గతంలో ఆగస్టు 10 నాటికి వ్యవసాయానికి నీటిని విడుదల చేయగా.. ఈ సీజన్‌లో కొంత ఆలస్యంగానైనా నీళ్లు వస్తాయనే ఆశతో రైతులు ఉన్నారు. ఈ నెల 5వ తేదీన రాష్ట్రస్థాయి సమగ్ర నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (స్కివం) సమావేశమై 15 రోజుల తర్వాత నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలని తీర్మానించారు. ఈ సమావేశం నేడో, రేపో హైదరాబాద్‌లో జరగాల్సి ఉండగా.. ఈ 15 రోజుల్లో ఆశించిన మేర ప్రాజెక్టుల్లోకి వరద నీళ్లు రాలేదు.

హనుమంతుడి ఊరేగింపులో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో పలువురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం

చందంపేట: హనుమంతుడి ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు జరిగిన విద్యుదాఘాతంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. చందంపేట మండలం పొగిళ్ల గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతి యేడు శ్రావణ మాసంలో పొగిళ్లలోని ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమంతుడిని ఊరేగించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా మంగళవారం కూడా స్వామివారిని ఎడ్లబండిపై ఊరేగిస్తున్నారు. ఈ క్రమంలో అధిక సంఖ్యలో గుమిగూడిన ప్రజలను చూసి ఎద్దులు బెదిరి పరుగుతీయడంతో ఎడ్లబండిపై ఉన్న జటావత్ కేశి, జటావత్ లక్ష్మి, జటావత్ తిరుపతితో పాటు మరో ఐదుగురు సబ్‌స్టేషన్ నుంచి గ్రామానికి సరఫరా అవుతున్న విద్యుత్‌వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై గాయపడ్డారు. వీరిలో లక్ష్మి, తిరుపతి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మిగిలిన ఆరుగురు దేవరకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి


కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఉత్తీర్ణులైన 2021-24 బ్యాచ్ విద్యార్థులకు పై చదువుల కోసం సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ అన్నారు. మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించట్లేదని తెలిపారు. ఫీజులు చెల్లిస్తేనే ఒరిజినల్ సర్టిఫికెట్‌లు ఇస్తామని గత 20 రోజులుగా కళాశాల యాజమాన్యం విద్యార్థులను తిప్పుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వినోద్, విష్ణు, భాస్కర్, మునేష్, సంజయ్, వినయ్, పవన్, జగదీష్, లోకేష్, గంగోత్రి, విజయలక్ష్మి, రమ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం


గరుడవాహనంపై ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణాలతో మంగళవారం వైభవంగా నిర్వహించారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా పూర్తిగావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు ఇవ్వాలని ధర్నా

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండలం కుడకుడ గ్రామ శివారులోని సర్వేనంబర్ 126లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం గుడిసెల వద్ద సీపీఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఆరేళ్లుగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే గత ప్రభుత్వంలోని నాయకులు గుడిసెలు తీసివేయించారని అన్నారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా ఇదే స్థలంలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారన్నారు. మాస్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, రవికుమార్, కమ్మకోట నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ధర్నాలో పాల్గొన్న సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి రంగారావు తదితరులు

కాంగ్రెస్ భూస్థాపితం కావడం ఖాయం


మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

పెద్దవూర : రైతు ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరని వందశాతం రుణమాఫీ చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో పెద్దవూర రైతువేదిక నుంచి జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి ప్రధాన కూడలిలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ చేస్తామని మాట తప్పిందన్నారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలకు జిల్లా అభివృద్ధి, రైతులపై చిత్తశుద్ధి లేదన్నారు. రైతుల పక్షాన పోరాటాలకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏరుకొండ నర్సింహ, ఏరుకొండ పద్మ, పాల్తీ శంకర్, జూలకంటి మట్టారెడ్డి, ఆంజనేయులు, కోమళ్ల వెంకటేశ్వర్లు, చందా వెంకట్‌రెడ్డి, జగన్‌నాయక్, రఘు, శంకర్‌యాదవ్, రాందాస్, శ్రావణ్, సుధాకర్‌రెడ్డి, మల్లయ్య, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.